# చేగుంటలో ముమ్మరంగా మొహర్రం ఏర్పాట్లు

## - గ్రామ పంచాయతీ ప్రత్యేక శ్రద్ధ



**చేగుంట, జూన్ 22 మెదక్ టుడే న్యూస్**
చేగుంట మండలం, చేగుంట గ్రామ పంచాయతీ సర్పంచ్, పాలకవర్గం ఆధ్వర్యంలో రాబోయే మొహర్రం (పీర్ల పండుగ) వేడుకలకు సంబంధించిన ముందస్తు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. గ్రామంలో హిందూ, ముస్లింలు ఎంతో పవిత్రంగా, సామరస్యంగా జరుపుకునే ఈ పండుగను పురస్కరించుకుని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గ్రామ పంచాయతీ సర్పంచ్, పాలకవర్గం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. పీర్ల చావిడీల వద్ద, ఊరేగింపు జరిగే ప్రధాన వీధుల్లో పారిశుధ్య పనులను వేగవంతం చేయడంతో పాటు, వీధుల శుభ్రత, బ్లీచింగ్ పౌడర్ చల్లడం, రాత్రి వేళల్లో భక్తులకు ఇబ్బందులు లేకుండా వీధి దీపాల (స్ట్రీట్ లైట్స్) పునరుద్ధరణ పనులను పాలకవర్గం దగ్గరుండి పర్యవేక్షిస్తోంది. పండుగ రోజుల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలని, పీర్ల దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం అన్ని మౌలిక వసతులు కల్పించాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. గ్రామంలో పండుగ వాతావరణం ఉట్టిపడేలా, ముస్లిం పెద్దలు, యువకులతో సమన్వయం చేసుకుంటూ అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తున్నట్లు గ్రామ పంచాయతీ పాలకవర్గం తెలిపింది.

# గీత పాఠశాలలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ ముందస్తు అవగాహన సదస్సు






**చేగుంట, జూన్ 22 మెదక్ టుడే న్యూస్**
చేగుంట మండలం,మెదక్ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు చేగుంటలోని గీత పాఠశాలలో విద్యార్థులకు 'యాంటీ డ్రగ్ అవేర్నెస్' అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ఎస్సై జి. చైతన్య కుమార్ రెడ్డి, పోలీస్ సిబ్బంది సమక్షంలో విద్యార్థులు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలను వివరించే పోస్టర్లు, ప్లకార్డులతో ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉంటూ చదువుపై శ్రద్ధ పెట్టాలని, ప్రతి ఒక్కరూ 'యాంటీ డ్రగ్ సోల్జర్'గా మారి డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. గంజాయి లేదా ఇతర డ్రగ్స్ సమాచారం తెలిస్తే భయపడకుండా ఈగిల్ ఫోర్స్ టోల్ ఫ్రీ నెంబర్ 1908 లేదా వాట్సాప్ నెంబర్ 8712671111 కి సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని, వివరాలు గోప్యంగా ఉంచబడతాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# సంగారెడ్డి జిల్లా శబరిమల అయ్యప్ప సేవా సమాజం నూతన కమిటీ నియామకం





**సంగారెడ్డి, జూన్ 21: (మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
శబరిమల అయ్యప్ప సేవా సమాజం (సస్స్ ) సంగారెడ్డి జిల్లా నూతన కమిటీని సదాశివపేటలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో ఘనంగా ఏర్పాటు చేశారు. సమాజ నేషనల్ జనరల్ సెక్రటరీ నాయిని బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు వెంకటేశ్వర్లు (కాజు గురు), చంద్రశేఖర్, వీరేష్‌లతో పాటు సదాశివపేట అయ్యప్ప దేవాలయ అధ్యక్షుడు గోనె శంకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు కాజు గురు మాట్లాడుతూ.. శబరిమలకు వెళ్లే తెలుగు భక్తులకు మెరుగైన సేవలందించేందుకు తెలుగు సేవా సంస్థలు బలోపేతం కావాలని, అందరూ ఐక్యంగా ఉండి సేవా కార్యక్రమాలను నిర్వహించాలని పిలుపునిచ్చారు. నాయిని బుచ్చిరెడ్డి మాట్లాడుతూ.. సమాజ శ్రేయస్సు, సనాతన ధర్మ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. సమాజ సేవా కార్యక్రమాల్లో భాగంగా ప్రతి కుటుంబం దైనందిన జీవితంలో భాగంగా ఒక రూపాయి, పిడికెడు బియ్యం దేవాలయాలకు అందించాలని సూచించారు. అలాగే, ఆరోగ్య పరిరక్షణలో భాగంగా బ్రహ్మ ముహూర్తాన నిద్రలేచి సూర్య నమస్కారాలు చేసేలా ప్రజలను చైతన్యపరచాలని కొత్తగా ఎన్నికైన కమిటీని ఆదేశించారు. నూతన కార్యవర్గ వివరాలు: గౌరవ అధ్యక్షులు: గూడెం మధుసూదన్ రెడ్డి (పటాన్చెరు) అధ్యక్షులు: గోనె శంకర్(సదాశివపేట) ప్రధాన కార్యదర్శి: మద్దూర్ పటేల్ శివశంకర్ (గడ్డపోతారం) సంస్థాగత కార్యదర్శులు: బలవంతరావు (పటాన్చెరు), సాహితీ రాము (సంగారెడ్డి) కోశాధికారి: ముప్పాడి సంతోష్ (సదాశివపేట) ఉపాధ్యక్షులు: జనప్రియ రాజు (సంగారెడ్డి), దేవి (నందిగామ), మద్దూరి పెంటేష్ (గడ్డపోతారం) జాయింట్ సెక్రటరీలు: పరమేశ్వర గౌడ్ (సంగారెడ్డి), రాజు పంతులు (జోగిపేట్), భూమయ్య (నారాయణఖేడ్) కమిటీ సభ్యులు: జింకల శ్రీనివాస్, హరి శంకర్ గౌడ్, అనిల్ గౌడ్, శ్రీశైలం, ఉమేష్, చింటూ గౌడ్, సాయి కిరణ్ తదితరులు.

# పరిశ్రమల్లో స్థానికులకే ప్రథమ ప్రాధాన్యత: ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి





**అమీన్‌పూర్, జూన్ 22:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
పటాన్‌చెరు నియోజకవర్గం, అమీన్‌పూర్ సర్కిల్ పరిధిలోని సుల్తాన్‌పూర్ మెడికల్ డివైస్ పార్కులో ఉన్న పరిశ్రమలు స్థానికులకు ఉద్యోగ అవకాశాల కల్పనలో ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని, స్థానిక ప్రాంత అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి యాజమాన్యాలకు స్పష్టం చేశారు. సోమవారం సుల్తాన్‌పూర్ మెడికల్ డివైస్ పార్కులోని ఐలా కార్యాలయంలో ఎమ్మెల్యే , పరిశ్రమల యాజమాన్యాలు మరియు ఐలా అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పరిశ్రమల రిక్రూట్‌మెంట్ ప్రక్రియలో పారదర్శకత ఉండాలని, ఉద్యోగ అవకాశాల గురించి స్థానికులకు వివిధ మాధ్యమాల ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని సూచించారు. పరిశ్రమల యాజమాన్యాలు తమ సామాజిక బాధ్యతగా ప్రజోపయోగ కార్యక్రమాలకు సి.ఎస్.ఆర్ నిధులను కేటాయించాలని కోరారు. ఈ పార్కులో ప్రస్తుతం 120 పరిశ్రమలు ఉత్పత్తిని కొనసాగిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై సమీక్షించేందుకు జులై మొదటి వారంలో మరోసారి సమావేశం కావాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, ఐలా కమిషనర్ శ్రీనివాస్, డిఈ సురేందర్, విద్యుత్ శాఖ ఏడి సంజయ్, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్య బలోపేతానికి కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలి: కాట సునీత





**పటాన్‌చెరు, జూన్ 22:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
పటాన్‌చెరు నియోజకవర్గం, బీరంగూడ విభాగం పరిధిలోని బాలాజీ కన్వెన్షన్ హాల్‌లో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) రాష్ట్ర నాయకురాలు కాట సునీత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఓటరు జాబితా సవరణలు మరియు ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో అనుసరించాల్సిన అంశాలపై బూత్ స్థాయి ఏజెంట్లకు వివరించారు. ఓటరు జాబితాలో ఎలాంటి పొరపాట్లు లేకుండా చూడాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని ఆమె పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయించేలా బూత్ స్థాయి ఏజెంట్లు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజాస్వామ్యాన్ని మరింత పటిష్టం చేసేందుకు పార్టీ కార్యకర్తలందరూ సమిష్టిగా కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక పార్టీ నాయకులు, బూత్ స్థాయి ఏజెంట్లు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మత్తు వద్దు నాన్న.. జీవితాలు చిత్తుఅవుతాయి కన్నా

## - మాదక ద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి యువత ముందుండాలి
## - ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్







**పాపన్నపేట,జూన్,22,మెదక్ టుడే న్యూస్:** మాదక ద్రవ్యాలు,మత్తు క్షణిక ఆనందాన్ని ఇచ్చినా, జీవితాలను చిత్తు చేస్తుందని, యువత చెడు వ్యసనాలకు దూరంగాఉంటూఆరోగ్యవంతమైన, బాధ్యతాయుతమైన జీవితాన్నిగడపాలనిపాపన్నపేటఎస్ఐశ్రీనివాస్ గౌడ్ పిలుపు నిచ్చారు. సోమవారం పాపన్నపేట జూనియర్ కళాశాలలో స్థానిక తహసీల్దార్ సతీష్ తో కలిసి మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహనసదస్సునిర్వహించి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మాదక ద్రవ్యాల బారిన పడితే విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారడంతో పాటు కుటుంబాలు, సమాజం కూడా తీవ్రంగా నష్టపోతాయని అన్నారు. సమాజంలో పెరుగుతున్న మాదక ద్రవ్యాలవినియోగాన్ని అరికట్టేందుకు యువతే చైతన్యవంతులుగా మారి ఇతరులను కూడా అప్రమత్తం చేయాలని సూచించారు. మత్తు పదార్థాలకు బానిస కావడం వల్ల ఆరోగ్య సమస్యలతో పాటు నేరప్రవృత్తులు పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. "మత్తు వద్దు నాన్న.జీవితంచిత్తవుతుంది కన్న" అనే నినాదంతో విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ, వాటి నిర్మూలనకు కృషి చేస్తామని విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై ప్రత్యేక శ్రద్ధచూపాలని,అనుమానాస్పద పరిస్థితులు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ సూచించారు. మాదక ద్రవ్యాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నర్సింలు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

